సాక్షి ఆదిలాబాద్

మంగళవారం : 30 : మే : 2023




రెండేళ్లుగా నిరీక్షణ..

8లో▸

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు 2020–21లో ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తులు ఆహ్వానించింది. లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇప్పటికి వారికి రుణాలు అందలేదు.

గిరి పల్లెలకు భగీరథ నీరు



గూడేలు, తండాల్లో గిరిజనుల తాగు నీటి ఇక్కట్లపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నటరాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

హిందువులపై విషం కక్కిన ఒవైసీ..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

దిలాబాద్: హిందువులపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విషం కక్కుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల నిర్మాణాలకు తమ సహకారంతోనే నిధులు వస్తున్నాయని అసదుద్దీన్ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 80శాతం హిందువులు రూ.లక్షల కోట్లు పన్నులు చెల్లిస్తే హిందూ ఆలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఎవరి వద్ద చెయ్యి చాచి అడుక్కునే పరిస్థితి హిందువులకు లేదన్నారు. ఒవైసీ వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్ నాయకులతోపాటు ఎమ్మెల్యే సైతం ఉన్నారన్నారు. ఆలయాల నిర్మాణాల విషయంలో ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తాం



రవీందర్ సింగ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలను నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల చైర్మన్, కరీంనగర్ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ సింగ్ అన్నారు. హైదరాబాదులో సోమవారం నిర్వహించిన హాకీ అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలో హాకీ క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో పోటీలను నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశానికి హాజరైన హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పార్థసారథి, అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సరల్ తల్వార్, చైర్మన్ కొండా విజయ్ కుమార్, కోశాధికారి భాస్కర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.





ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్ గ్రామం

పెయిన్.. కిల్లింగ్!

- 'మా మండలంలోని మామిడిగూడ, ముత్నూర్, హర్కాపూర్ గ్రామాల్లో గత నెల రోజుల వ్యవధిలోనే 20 మంది కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించారు. దీనిపై వైద్యారోగ్యశాఖ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఆర్ఎంపీల వైద్యంతోనే అమాయక ఆదివాసీలు కిడ్నీలు చెడిపోయి మృత్యువాత పడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలు వెల్లడించాలి.' ఈ నెల 24న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఇంద్రవెల్లి జెడ్పీటీసీ అర్క పుష్పలత చేసిన వ్యాఖ్యలివి.
- బేల మండలంలో బెంగాల్ డాక్టర్ల వైద్యం అమయాక ప్రజల ప్రాణలమీదకు తెస్తుంది. కాళ్లు, కీళ్ల నొప్పులతో స్థానికంగా ఉన్న బెంగాల్ వైద్యుల వద్దకు వెళ్లగా మోకాళ్లలో హైడోస్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. ఇవి తీసుకున్న వారి కిడ్నీలు నెల వ్యవధిలోనే చెడిపోయి దయాలసిస్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.' యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 27న కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు ఇది.

- హైడోస్ ఇంజక్షన్లతో కిడ్నీలపై ప్రభావం
- ప్రాణాల మీదకు తెస్తున్న ఆర్ఎంపీల వైద్యం
- నెల వ్యవధిలోనే 20 మంది వరకు మృత్యువాత
- సాక్షాత్తు జెడ్పీ సమావేశంలోనే విమర్శలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

కైలాస్‌నగర్: జిల్లాలో కొంతమంది ఆర్ఎంపీల అచ్చీరాని వైద్యం అమయాక ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. పల్లెవాసులు చిన్నపాటి అనారోగ్య సమస్యలు వస్తే ఎక్కువగా వీరినే ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో వారు మోతాదుకు మించి ఇస్తున్న హైడోస్ ఇంజక్షన్లు బాధితుల కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నెల గడువక ముందే బాధితులు డయాలసిస్‌కు వెళ్లాల్సి వస్తుండడం గమనార్హం. ఆర్ఎంపీల వైద్యంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నా.. ఫిర్యాదులు అందుతున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

ఆర్ఎంపీల వైద్యమే కారణమా..

జిల్లాలో ఆయా గూడాలు, తండాల్లో ఉండే ఆదివాసీలు, గిరిజనులు అనారోగ్య సమస్యలు వస్తే ఎక్కువగా ఆర్ఎంపీలను ఆశ్రయిస్తుంటారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే ఆర్థికస్థోమత లేకపోవడం, ప్రభుత్వాసుపత్రుల్లో సకాలంలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో స్థానికంగా ఉన్న వీరే దిక్కవుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొంతమంది అచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణల మీదకు తెస్తున్నారు. రోగుల జబ్బులు త్వరితగతిన నయం కావాలని హైడోస్ ఇంజక్షన్లు వేస్తున్నారు. మోతాదుకు మించి మాత్రలు ఇస్తున్నారు. వాటిని ఉపయోగించిన రోగులకు తాత్కాలికంగా ఉపశమనం కలుగుతున్నప్పటికీ వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆర్ఎంపీల వద్ద ఇంజిక్షన్లు తీసుకున్న రోగులు నెల గడవక ముందే కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది.

పెరుగుతున్న బాధితులు

జిల్లాలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇందుకు బెంగాళీ వైద్యుల వైద్యమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వీరితో పాటు జిల్లా వైద్యారోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేని ఆర్ఎంపీలు సైతం పల్లెల్లో తిరుగుతూ రోగులకు అనధికారికంగా ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. కొంతమంది ఏకంగా ఆసుపత్రి తరహాలో పడకలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని బేల, ఉట్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ తదితర మండలాల్లో ఇలాంటివి ఎక్కువగా నిర్వహిస్తున్నారు. వీరు మోతాదుకు మించి ఇస్తున్న మాత్రలు, ఇంజక్షన్లతో రోగుల కిడ్నీలపై ప్రభావం చూపుతున్నాయి. ఆర్ఎంపీలను ఆశ్రయించిన మరుసటి నెలకు రిమ్స్‌కు వెళ్లితే అక్కడ పరీక్షించిన వైద్యులు కిడ్నీలు చెడిపోయాయని, డయాలసిస్ చేయాలని చెబుతుండటం కలవరానికి గురి చేస్తోంది.

పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు



వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతి లేకుండా ఆర్ఎంపీలు ప్రాక్టీస్ చేయడం చట్టరీత్యానేరం. అలాగే పడకలతో కూడిన వైద్యమందించడం కూడా నిబంధనలకు విరుద్ధం. ఇలాంటి వారు ఎక్కడైనా వైద్యం చేస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. ఇంద్రవెల్లి మండలంలో 20 మంది ఒక నెలలో మరణించారనడం పూర్తిగా అవాస్తవం. గతంలో ధనోరాలో ఇలాంటి పరిస్థితే ఉందని మా దృష్టికి రావడంతో అక్కడ ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశాం.

– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో

పరిమితికి మించితే ప్రమాదం



ఆర్ఎంపీలు యాంటిబయటిక్స్, పెయిన్ కిల్లర్స్, స్టిరాయిడ్స్ ఇవ్వడానికి వీలు లేదు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా ఉండే వీరి వద్దకు వచ్చే బాధితులకు పరిమితికి మించి పెయిన్‌కిల్లర్స్, యాంటిబెటిక్స్ ఇస్తుంటారు. నెలల తరబడి వీటిని వాడడంతో బీపీ, షుగర్‌తో పాటు ఎముకల్లో కాల్షియం తగ్గిపోయి కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. ప్రజలు వారికి వచ్చిన జబ్బును నిపుణులైన వైద్యులతో నిర్ధారించుకొని చికిత్స చేయించుకోవాలి. ఆర్ఎంపీలపై ఆధారపడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– డాక్టర్ సుమలత, ఎండీ ఫిజీషియన్

ప్రగతి ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేడుకల నిర్వహణపై జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన నుంచి ఇప్పటివరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతు దినోత్సవం, చెరువుల పండుగ, విద్యుత్ దినోత్సవ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. జిల్లాలోని 101 రైతువేదికలను, సబ్‌స్టేషన్లను, ప్రభుత్వ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే సాగు నీటి దినోత్సవం, విద్యుత్ విజయోత్సవం, సంక్షేమ సంబురాలు వంటి కార్యక్రమాల్లో వెయ్యి మందికి పైగా ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఇందు కోసం గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సురక్ష దినోత్సవం, తెలంగాణ రన్ వంటి కార్యక్రమాల్లో శాంతి భద్రతల రక్షణ, సేవలను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల వేదికలు, నిర్వహణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, డీఎఫ్‌వో రాజశేఖర్, ట్రెయినీ కలెక్టర్లు శ్రీజ, వికాస్ మోహతో, మున్సిపల్ చైర్మన్ ప్రేమెందర్, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, ఆర్డీవోలు రమేశ్‌రాథోడ్, కదం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో వేడుకలు..

కైలాస్‌నగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో జూన్ 2 నుంచి 22వరకు నిర్వహించే ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్. నటరాజ్, డీఎఫ్‌వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతం మారిన ఆదివాసీలు వాపస్ రావాలి



పట్టణంలో ర్యాలీ చేపడుతున్న ఆదివాసీలు

- లేకుంటే రిజర్వేషన్ రద్దు చేసేలా పోరాడుతాం
- గిరిజన సాంస్కృతిక పరిరక్షణ సభలో ఎంపీ సోయం బాపూరావ్



అభివాదం చేస్తున్న ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్‌రూరల్: మతం మారిన ఆదివాసీలు తిరిగి రావాలని, లేకుంటే వారి ఎస్టీ హోదా రద్దు అయ్యేలా పోరాడుతామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మతం మారిన ఆదివాసీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జన జాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో సోమవారం గిరిజన సాంస్కృతిక పరిరక్షణ ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఇప్పటి వరకు 1,200 మంది ఆదివాసీలను మత మార్పిడి చేయించారన్నారు. ఇందులో 12 మంది పాస్టర్లుగా మారారన్నారు. ఆదివాసీ ఆడపిల్లలకు ఉద్యోగం వచ్చిందంటే చాలు ఇతర మతాల వారు ఏదో మాయమాటలు చెప్పి వారితో మత మార్పిడితో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల భూములను వారి పేర్లపై పట్టాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. ఈ మోసాలపై ప్రతీ గ్రామంలో చర్చ జరపాలన్నారు. అంతకముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మహారాష్ట్రలోని కిన్వట్, పాంఢ్రకవడ ఎమ్మెల్యేలు కేరం భీంరావ్, సందీప్ దుర్వే, జన జాతి సురక్ష సమితి ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ హెచ్‌కే నాగు, జిల్లా కన్వీనర్ కొడప నగేష్, కోకన్వీనర్ మెస్రం రాజేశ్వర్, ఐటీడీఏ మాజీ చైర్మన్ సిడాం భీంరావ్, జిల్లా సెర్మడి మెస్రం దుర్గు, వినాయక్‌రావ్, సిడాం తులసీరాం, సిడాం రాంకిషన్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- కలెక్టరేట్ ఎదుట ఎన్‌పీఆర్‌డీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: మంత్రి హోదాలో స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న దివ్యాంగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 2014లో మున్సిపల్ కార్యాలయం ఎదుట 113 రోజుల పాటు ధర్నా చేశామన్నారు. అప్పుడు మంత్రిగా ఉన్న జోగు రామన్న నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని 2015లో తమకు రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటికీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సీజన్ ముందుకు..



ఇక్కడ కనిపిస్తున్నది ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రైతు కాటిపెల్లి చంద్రశేఖర్‌రెడ్డి. ఈ ఏడాది యాసంగిలో నాలుగెకరాల్లో జొన్న సాగు చేశాడు. వడగళ్ల వర్షానికి పంట నేలకొరిగి సుమారు రూ.లక్షయాభై వేల వరకు నష్టపోయానని చెబుతున్నాడు. ఏటా వడగళ్ల వర్షం, ఈదురుగాలులలో నష్టపోతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలోని చాలా మండలాల్లో అకాల వర్షాలతో రైతులు పంటలు నష్టపోయారు.



అకాల వర్షాల కారణంగా తాంసి మండలం పొన్నారిలో జొన్న పంటకు వచ్చిన మొలకలు (ఫైల్)

- 'అకాల' నష్ట నివారణపై ప్రభుత్వం కసరత్తు
- జిల్లాలో ఏడు మండలాల ప్రభావంపై మ్యాపింగ్
- వడగళ్లు తట్టుకునే రకాలపై వ్యవసాయశాఖ దృష్టి

వడగళ్లతో నష్టపోయిన పంటల వివరాలు

సంవత్సరం	పంటనష్టం (ఎకరాల్లో)
2021–22	1,842
2022–23	2,143

ఇచ్చోడ: జిల్లాలో రెండేళ్లుగా అకాల వర్షాలు రైతులను నిండా ముంచుతున్నాయి. ఆరుగా లం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే క్రమంలో వడగళ్లు వారికి కడగండ్లను మిగులుస్తున్నా యి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఫిబ్రవరి, మా ర్చిలో కురిసిన అకాల వర్షాలతో మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ క్రమంలో పంట నష్ట నివారణపై వ్యవసాయ విశ్వవిద్యాలయం దృష్టి సారించి కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయి సమాచారాన్ను ఉపగ్రహ చిత్రాలు, ఇతర సాంకేతిక ఆధారాల సాయంతో జిల్లాలో వడగళ్లు, తీవ్ర ఈదురుగాలులు ఉన్న ప్రాంతాలను గుర్తించింది.

ఏడు మండలాలు గుర్తింపు...

జిల్లాలోని ఇచ్చోడ, బోథ్, సిరికొండ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, తలమడుగు, జైనథ్ మండలాల్లో వడగళ్లు, ఈదురు గాలుల ప్రభావం తీవ్రస్థాయిలో ఉన్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం అధికారులు మ్యాపింగ్ చేశా రు. ఈ మండలాల్లో వడగళ్లు, ఈదురుగాలు లకు ఎక్కువ అవకాశం ఉందని గుర్తించారు.

వడగళ్లను తట్టుకునే రకాలు..

రాష్ట్రంలో పంటల సీజన్ కాస్త ముందుకు జరపాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో తదనుగుణంగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. యాసంగి పంటలను యాజమాన్య పద్ధతిలో సాగు చేసుకోవాలని, అలాగే స్వల్పకాలిక పంటలైన పెసర, మినుము, సజ్జ, నువ్వు, ఆవాలు సాగుపై ఎక్కువగా దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ పంటలు 80 నుంచి 90 రోజుల్లో కోతకు రావడంతో అకాల వర్షాల బెడద ఉండదని చెబుతున్నారు. సాధారణంగా జొన్న, మొక్కజొన్న 120 నుంచి 130 వరకు కోతకు వస్తాయని ఈ రెండు రకాల్లోనూ స్వల్పకాలిక (వంద రోజుల్లో) రకాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో సాగు చేసే పంటలను నవంబర్ చివర, డిసెంబర్ మొదటి వారంలో పూర్తి అయ్యేలా చూసుకోవాలని పేర్కొంటున్నారు. యాసంగి సైతం మార్చి చివరలోనే పంట చేతికొచ్చేలా సాగు విధానంలో మార్పు చేసుకుంటే ఏప్రిల్, మే నెలల్లో కురిసే అకాల వర్షాల నుంచి పంటలను రక్షించుకోవచ్చునని సూచిస్తున్నారు.

ఈ ఏడాది తొమ్మిది సార్లు వడగళ్లు..

జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా తొమ్మిదిసార్లు వడగళ్ల వాన కురిసింది. మార్చిలో 3 సార్లు, ఏప్రిల్‌లో 4 సార్లు, మేలో 2 సార్లు నమోదయ్యాయి. వాతావరణ మార్పుల కారణంగా రానున్న రోజుల్లో ఏడు మండలాల్లో మరోమారు వడగళ్లు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నుంచి సమాచారం వస్తోంది.

యాజమాన్య పద్ధతిలో సాగు చేయాలి

రైతులు యాసంగిలో యాజమాన్య పద్ధతుల ద్వారా పంటల సాగు చేపట్టాలి. పంటల సీజన్‌ను ముందుకు జరపాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో కసరత్తు జరుగుతుంది. స్వల్పకాలిక పంటల సాగు మేలు చేస్తాయి. యాసంగిలోలో నీటి లభ్యత ఉన్న రైతులు నవంబర్‌లోనే సాగుకు సిద్ధం కావాలి. జొన్న, మొక్కజొన్నలో కూడా స్వలకాలిక రకాలు విత్తుకోవాలి. అకాల వర్షాల నుంచి పంటల రక్షణ కోసం మ్యాపింగ్ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశాం.

– శ్రీధర్ చౌహాన్, వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ టీచర్‌ను మానసిక వేధింపులకు గురి చేసి, గ్రామం నుంచి వెళ్లిపోయేలా హింసించిన ఐసీడీఎస్ జైనథ్ ప్రాజెక్ట్ సీడీపీవో, సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కె.రాధ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జైనథ్ మండలంలోని పుసాయి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రికార్డులు రాయడం లేదని వేధింపులకు గురి చేశారన్నారు. ఈ క్రమంలో ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసిందన్నారు. అయినా సదరు అధికారులు వేధింపులు ఆపకపోవడంతో ఆమె కుటుంబంతో సహా గ్రామాన్ని వదిలివెళ్లిందన్నారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు సునంద, నర్సమ్మ, వసంత పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాశాఖ మంత్రిని కలిసిన ఇన్‌చార్జి వీసీ



మంత్రి సబితారెడ్డితో వెంకటరమణ

భైంసా(ముధోల్): బాసర ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో సమస్యలు, ప్రవేశాల నేపథ్యంలో మంత్రిని కలిసి విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఎలుగుబంటి సంచారం



రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగుబంటి

తాంసి(బోథ్): మండలంలోని జామిడి శివారులో సోమవారం ఎలుగుబంటి సంచరించింది. పాలోది గ్రామానికి చెందిన రైతులు పంటచేలకు వెళ్తుండగా రోడ్డు పక్కన సంచరిస్తూ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. రైతులు పెద్దగా అరవడంతో రోడ్డుపై నుంచి దూరంగా చెట్లపొదల నుంచి చెరువు వైపు పారిపోయింది. ఎలుగుబంటి పంటచేలవైపు రాకుండా అటవీశాఖ అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, సేవానాయక్ తండాలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరిని సోమవారం తహసీల్దార్ రాజమోహన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. నిందితుల వద్ద ఇప్పటికే గుడుంబా స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. మరోసారి నేరం చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు బైండోవర్ చేశామన్నారు. ఎవరైనా గుడుంబా విక్రయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు.

జొన్నపంట దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసారూరల్(ముధోల్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో సోమవారం జొన్నచేనులో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుని జొన్నపంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఆశగౌడ్ తిమ్మాపూర్ గ్రామ శివారులోని నాలుగెకరాల్లో జొన్నపంట సాగు చేశాడు. రెండు ఎకరాల్లో పంటను కోసి చేనులోనే కుప్పలుగా పోసాడు. సోమవారం ప్రమాదవశాత్తూ పంటచేనులో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆశగౌడ్ తెలిపాడు.

రెండేళ్లుగా నిరీక్షణ..

- ఇప్పటి వరకూ అందని ఎస్సీ కార్పొరేషన్ రుణాలు
- 2020–21లో దరఖాస్తుల స్వీకరణ
- 132 మంది లబ్ధిదారుల ఎంపిక
- కార్యాలయాల చుట్టూ నిరుద్యోగుల ప్రదక్షిణ
- స్పందించని ప్రభుత్వం, అధికారులు
- ఆందోళనలో లబ్ధిదారులు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశం కల్పించడానికి, రైతులు పంటల దిగుబడులు సాధించడానికి ప్రభుత్వం ఆయా శాఖల కార్పొరేషన్‌ల ద్వారా ఆయా ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వారికి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కింద రుణాలు అందించేందుకు 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. లబ్ధిదారులను సైతం ఎంపిక చేసింది. ఇప్పటి వరకూ వారికి రుణాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వివిధ కేటగిరీల్లో..
బ్యాంక్ లింకేజీ ద్వారా అందజేసే సబ్సిడీ రుణాలకు ప్రభుత్వం మూడు కేటగిరీలలో సబ్సిడీని అందజేస్తుంది. మొదటి కేటగిరీలో రూ.లక్ష రుణం కోసం రూ.80 శాతం సబ్సిడీ, మిగితా 20 శాతం బ్యాంక్ రుణం, రెండవ కేటగిరీలో రూ.2 లక్షల రుణానికి 70 శాతం సబ్సిడీ, మిగితాది బ్యాంక్ రుణం, మూడో కేటగిరీ రూ.3 లక్షలకు పైగా రూ.5 లక్షలలోపు రుణానికి 60 శాతం సబ్సిడీ, మిగితాది బ్యాంక్ రుణం.

132 మంది లబ్ధిదారుల ఎంపిక
స్వయం ఉపాధి రుణాల కోసం అన్‌స్కిల్డ్ రంగంలో ఎలక్ట్రికల్ షాప్, చెప్పుల దుకాణం, టెంట్‌హౌజ్, తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి 83 మందికి రూ. 2.35 కోట్లతో, మరో 82 మందికి రూ. 2.35 కోట్లతో స్కిల్ రంగంలో ఆటో, కారు, బేకరీ, బ్యూటీపార్లర్ రుణాలు ఇవ్వాలని అధికారులు 2020–21 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇందులో అన్‌స్కిల్డ్ రంగంలో 83 మందికి రూ.1.04 కోట్లు సబ్సిడీ రూపంలో అందజేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. స్కిల్ రంగంలో 82 యూనిట్లకు గానూ 49 మందిని ఎంపిక చేయగా వీరికి సబ్సిడీ కింద రూ.86.47 లక్షలు అందజేయనున్నారు. ఇదిలా ఉండగా స్కిల్డ్ రంగంలో 82 మందికి కేవలం 49 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణం మంజూరు కాగా మిగితా 49 మందికి బ్యాంక్ కన్సల్ట్ ఇవ్వకపోవడంతో వారికి రుణాలు మంజూరు కాలేదు.

ఏ ఒక్కరికీ జమకాని సబ్సిడీ
ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2020–21 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు మంజూరైనప్పటికీ వారి ఖాతాలలో సబ్సిడీ నగదు జమ కావడం లేదు. దీంతో యూనిట్లు మంజూరైన లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఆ శాఖ కార్యాలయాలు, స్థానికంగా ఉన్న ప్రజా ప్రతి నిధుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా రు. అటు సబ్సిడీ జమకాక, ఇటు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సబ్సిడీని తమ ఖాతాల్లో జమ చేస్తే యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని చెప్పన్నారు.

ఆందోళనలో లబ్ధిదారులు
ఎస్సీ కార్పొరేషవన్ ద్వారా ఎస్సీలకు సబ్సిడీపై అందజేసే స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకుని రెండేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ రుణాలు అందకపోవడంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఆసక్తి కనబర్చి రుణాలు సబ్సిడీ జమ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సకాలంలో సబ్సిడీ జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ల్యాబ్ కోసం దరఖాస్తు...



రెండేళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ శాఖలో రూ.3 లక్షల యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా. కార్పొరేషన్ ద్వారా వారం రోజుల పాటు ఉట్నూర్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు సబ్సిడీ జమ కావడం లేదు. సబ్సిడీ మంజూరైతే సొంతంగా క్లినిక్ ల్యాబ్ ఏర్పాటు చేసుకుంటా.

– స్వరూప, పిప్పల్‌ధరి, ఆదిలాబాద్‌రూరల్

కూలీ పనులకు వెళ్తున్నా



ఎస్సీ కార్పొరేషన్ శాఖలో రూ.50వేల విలువ చేసే టీ, టిఫిన్ సెంటర్ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా. కానీ రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు సబ్సిడీ రావడం లేదు. కూలీ పనులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా.

– దాసరి దేవత, కచికంటి, ఆదిలాబాద్

ఖాతాలోనే జమ అవుతుంది



2020–21 ఆర్థిక సంవత్సరంలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ రంగంలో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ ద్వా రా 165 మంది లబ్ధిదారులకు రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో అన్‌స్కిల్డ్ రంగంలో 83, స్కిల్డ్ రంగంలో 82 మందికి గానూ 49 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. సబ్సిడీ నేరుగా లబ్ధిదారుని ఖాతాలోనే జమ అవుతుంది.

– శంకర్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

తేనెటీగల నుంచి తప్పించుకుందామని..

- బావిలో దూకిన యువకుడు
- ఈత రాకపోవడంతో నీటమునిగి మృతి



నర్సయ్య మృతదేహం

సోన్: తేనెటీగల దాడి నుంచి తప్పించుకునేందుకు ఓ యువకుడు బావిలో దూకాడు. బావి లోతు ఎక్కువగా ఉండడం, అతడికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన సోన్ మండలం సాకేర గ్రామంలో సోమవారం జరిగింది. సాకెర గ్రామంలో సోమవారం కొంతమంది భీమన్న దేవుని పండుగ నిర్వహించారు. ఈ క్రమంలో ఊరు శివారులో ఉన్న మర్రి చెట్టు వద్దకు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ దీపాలు, అగర్‌బత్తులు వెలిగించారు. ఒకవైపు డప్పు చప్పుళ్లు.. మరోవైపు అగర్‌బత్తుల పొగకు చెట్టుపైన ఉన్న తేనెతుట్టె నుంచి ఈగలు లేచాయి. పూజలు చేస్తున్నవారిపై దాడిచేశాయి. దీంతో అందరూ అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కల్లెడపు నర్సయ్య(27) కూడా తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశాడు.

బావిలో దూకితే కుట్టవని..
ఈ క్రమంలో సమీపంలోని చేనులో వ్యవసాయ బావి ఉంది. నీటిలో మునిగితే తేనెటీగల నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. లోతు గురించి ఆలోచించకుండా బావిలో దూకాడు. అయితే బావి లోతు ఎక్కువగా ఉండడం, నర్సయ్యకు ఈత రాకపోవడంతో సాయం కోసం కేకలు వేశాడు. దీంతో సమీపంలోని వారు బావి వద్దకు చేరుకున్నారు. కానీ, అప్పటికే నర్సయ్య నీటమునిగాడు. స్థానికులు బావిలో దిగి నర్సయ్యను పైకి తీసుకెవచ్చారు. కానీ ఫలితం లేకుండా పోయింది. నీళ్లు మింగడంతో చనిపోయాడు.

రెండేళ్ల క్రితమే వివాహం..
నర్సయ్యకు ప్రవంతితో రెండేళ్ల క్రితమే వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. ఈ క్రమంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో నర్సయ్య మృత్యువాతపడ్డాడు. గ్రామస్తుల సమాచారంతో ఎస్సై రవీందర్ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దప్పిక తీరుస్తూ..అడవులను సంరక్షిస్తూ..

- వేసవిలో వన్యప్రాణులు, అటవీ సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు



కడెం(ఖానాపూర్): మానవాళి మనుగడకు అడవులే ఆధారం.. అడవిలో ఉంటున్న మూగజీవాలు వేసవి కాలంలో దప్పిక తీర్చుకునేందుకు జనారణ్యంలోకి వచ్చి మృత్యువాత పడుతుండేవి. అడవుల్లో వ్యాపించే మంటల్లో చిక్కుకుని అగ్నికి ఆహుతి అయ్యేవి. వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తూ వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పించేందుకు అటవీశాఖ అధికారులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

వన్యప్రాణుల దప్పిక తీరుస్తూ..
వేసవికాలంలో వాగులు, వంకలు ఎండిపోయి నీరు లేక వన్యప్రాణులు దప్పిక తీర్చుకునేందుకు జనారణ్యంలోకి వచ్చేవి. నీటిని తాగేందుకు వ్యవసాయ బావుల వద్దకు వచ్చి అందులో పడిపోవడం, వీధి కుక్కల దాడుల్లో మృత్యువాత పడటం చూశాం. కానీ కొన్నేళ్లుగా అటవీశాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో వన్యప్రాణులకు అడవుల్లో నీళ్లు దొరుకుతున్నాయి. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఖానాపూర్ డివిజన్ పరిధిలో 320 సాసర్ ఫీట్స్, 50 చెక్‌డ్యాంలు, పెర్కులేషన్ ట్యాంక్(నీటి కుంటలు), 24 సోలార్ బోర్‌లతో పాటుగా నీటి లభ్యత ఉండే వాగుల్లో సుమారు 20 వరకు చెలిమెలు ఏర్పాటు చేశారు. అటవీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా సాసర్ ఫీట్స్‌లలో నీటిని నింపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తుగానే ఫైర్‌లైన్స్..
ఏటా వేసవి కాలంలో అడవుల్లో మంటలను అరికట్టేందుకు అటవీ అధికారులు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 3,56,251 హెక్టార్లలో భూవిస్తీర్ణం ఉండగా 1,20,566.75 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. 33.08 శాతం అటవీ ప్రాంతం ఉంది. ఒక ప్రాంతంలో మొదలైన మంటలు మరో ప్రాంతంలోకి వ్యాపించకుండా ఉండేందుకు అటవీ సిబ్బంది ఏటా వేసవికాలం ఆరంభం నుంచే ప్రత్యేకమైన బ్లోయర్ మిషన్‌లతో రాలిపోయిన ఆకులన్నింటినీ ఒకచోటకు చేర్చి ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత ఆకులను కుప్పలుగా చేసి తగలబెడతారు. అడవుల్లో మంటలు వ్యాపించిన సమాచారం తెలిసిన వెంటనే తెలియజేసేందుకు అటవీశాఖ గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతాల్లో అంటుకున్న మంటలను శాటిలైట్ రిసీవ్ చేసుకుని హైదరాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయానికి అందజేస్తుంది. అక్కడి నుంచి సంబంధిత అధికారులకు సమాచారం అందుతుంది. సమాచారం అందుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది(ఫైల్)



నీటిని తాగుతున్న వన్యప్రాణులు

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



వేసవిలో వన్యప్రాణుల దప్పిక తీర్చేందుకు అటవీ ప్రాంతంలో మూగ జీవాలకు అందుబాటులో నీళ్లు ఉండేలా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నాం. అడవులు దగ్ధం కాకుండా ఉండేందుకు వేసవి కాలం ప్రారంభంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అడవుల సంరక్షణ మనందరి బాధ్యత. అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలి.

– కోటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

‘గిరి’పల్లెలకు మిషన్ భగీరథ నీరు



గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

- కదిలిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గూడేలు, తండాల్లో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలపై ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన ‘దాహం తీర్చని భగీరథ’ కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం 8 గంటల నుంచే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. సర్పంచ్ జాదవ్ జిజాబాయి ప్రేమ్ సింగ్ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తండా, కొలంగూడ, గోండుగుడాలకు సరిపడా నీటిని సరఫరా చేశారు. సుంగాపూర్ సమీపంలో ఉన్న వాగుపై నీటి నిల్వ కోసం చిన్న ప్రాజెక్టు మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరారు. ‘సాక్షి’లో వచ్చిన కథనంతో దాహార్తి తీర్చడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి కొరత తీర్చిన అధికారులు
బోథ్: ‘దాహం తీర్చని భగీరథ’ శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయమే నాగాపూర్ గ్రామాన్ని సందర్శించి బావిలో ఉన్న నీటిని పరిశీలించారు. బోరు ద్వారా నీటిని మిషన్ భగీరథ ట్యాంకులో నింపారు. దీంతో గ్రామస్తులకు నీరు అందనుంది. గతంలో నీటిని ఓపెన్ బావిలో నింపడం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. మిషన్ భగీరథ ట్యాంకులో నీటిని నింపడంతో గ్రామంలో నీటి కొరత తీరనుంది. గ్రామంలో నీటికొరత ఉండనివ్వమని మండల పంచాయతీ అధికారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



గోండుగూడలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు

అత్యవసరమైతే అవస్థలు పడాల్సిందే





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పేద ప్రజల వైద్యానికి వర ప్రదాయినిగా నిలిచే రిమ్స్ ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం రోగులతో పాటు వారి సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మెరుగైన వైద్యం మాట అటుంచితే.. కనీసం అత్యవసర పరిస్థితుల్లో ఒంటికి.. రెంటికి వెళ్లాలంటే ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో గల మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచడంతో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన కుమ్రం మోతీరాం స్వయం ఉపాధి కోసం బొలెరో వాహనం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం శ్యాంనాయక్ తండాకు చెందిన ఆడే సంతోశ్ కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు నీటి వసతులు కల్పించాలని, పెంబి మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

నర్సాపూర్(జి): మండలంలోని బుర్గుపల్లి(కే) గ్రామానికి చెందిన దుగ్గి భోజవ్వ(70) సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు 61వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మరిది కుమారుడు దుగ్గి లస్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు.. పోలీసులు తెలిపిన ప్రకారం మహారాష్ట్రలోని ఇస్లాపూర్ సమీపంలోని కోస్‌ఖేడ్‌కు చెందిన ఖేద్కర్ పవన్ తన మిత్రుడు సతీష్‌తో కలిసి సోమవారం పనినిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా మండల కేంద్రంలోని శర్మ దాబా సమీపంలో బైక్ అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై రెహమాన్ తెలిపారు.

‘కుమారున్ని ఉద్యోగం నుంచి తొలగించడంతోనే మృతి’

ఆదిలాబాద్‌రూరల్: తమ కుమారుడిని ఉద్యోగం నుంచి తొలగించడంతోనే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని న్యూరాంపూర్ గ్రామానికి చెందిన కొట్నాక్ జంగుబాయి మృతి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. జంగుబాయికి సంబంధించిన మూడెకరాల వ్యవసాయ భూమి రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం తీసుకుని ఆమె కుమారునికి ఉద్యోగం ఇచ్చారన్నారు. మూడు నెలల పాటు పని చేయించుకున్న యాజమాన్యం మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో వేరే వ్యక్తికి ఉద్యోగం ఇప్పించి ఆమె కుమారుడిని తొలగించారని మృత్యురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారన్నారు.

ఒకరు అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌కు చెందిన బట్టు రమాకాంత్ (34) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రమాకాంత్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 22న ఉదయం ఆటో తీసుకుని ఇంటి నుంచి వెళ్లాడు. ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో సోమవారం అతని భార్య అనిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.